సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



తక్కువ ధరకే కొంటున్నారు..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో జాప్యం జరుగుతుండడంతో దళారులు పొలాల వద్దకే వెళ్లి తక్కువ ధరకు ధాన్యం కొంటున్నారు. 8లో



ముమ్మరంగా కూంబింగ్

పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో మావోల చర్యలను అడ్డుకునేందుకు పోలీసులు ముమ్మరంగా కూంబింగ్ చేస్తున్నారు. 10లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
30° / 23°

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని చోట్ల సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

- ఐటీడీఏ పీఓ రాహుల్



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

టేకులపల్లి: గిరిజన విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. మండల పరిధిలోని కోయగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. వంట గది, పాత్రలను, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఉత్తమ సమాధానాలు చెప్పిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇల్లెందు ఏటీడీఓ రాధ, ప్రధానోపాధ్యాయుడు బి.అమర్‌సింగ్ పాల్గొన్నారు.

7 నుంచి సీఎం కప్ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: గ్రామ స్థాయి నుంచి క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఈనెల 7 నుంచి సీఎం కప్–2024 పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖాధికారి పరంధామరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8 తేదీల్లో గ్రామ స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడీ, ఖోఖో పోటీలు జరుగుతాయని, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో నిర్వహిస్తామని వివరించారు. జిల్లా స్థాయి పోటీలు పాల్వంచ శ్రీనివాస కాలనీ, మినీ స్టేడియం, కేటీపీఎస్ గ్రౌండ్, కొత్తగూడెంలోని శ్రీరామచంద్రా డిగ్రీ కళాశాల, ప్రగతి మైదాన్‌లో జరుగుతాయని పేర్కొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంఅర్బన్: గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు అందజేసిన వారి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ రోహిత్‌రాజ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు తమ సమస్యలపై వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఫిర్యాదులపై తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల విచారణలో జాప్యం జరగకుండా చూడాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాకు కొత్త అంబులెన్స్‌లు

- 11 వాహనాలు కేటాయించిన ప్రభుత్వం

ఖమ్మంవైద్యవిభాగం: రాష్ట్రప్రభుత్వం వివిధ జిల్లాలకు కొత్తగా 108 అంబులెన్స్‌లను కేటాయించింది. ఆయా వాహనాలను సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రతీ మండలానికి ఒక వాహనం ఉండాలనే ఉద్దేశంతో వాహనాలు లేని మండలాలకు నూతన వాహనాలు సమకూర్చింది. ఈమేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 11వాహనాలు కేటాయించగా.. ఖమ్మం జిల్లాకు ఐదు, భద్రాద్రి జిల్లాకు ఆరింటిని పంపించారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటికే 17 వాహనాలు ఉండగా చింతకాని, కొణిజర్ల, పెనుబల్లి, వేంసూరు, కారేపల్లి మండలాలకు కొత్తగా వాహనాలు సమకూర్చారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 22 వాహనాలు ఉండగా జానంపేట, ఎస్‌ఎన్.పురం, ఊటుకూరు, అశ్వారావుపేట, చుంచుపల్లి, గుండాల పీహెచ్‌సీలకు ప్రస్తుతం ఆరు కేటాయించారు. ఈ వాహనాల్లో సేవలందించేందుకు పైలట్, టెక్నీషియన్లను ఇప్పటికే నియమించి శిక్షణ కూడా ఇచ్చారు. దీంతో రెండు, మూడు రోజుల్లో అంబులెన్స్‌లో అందుబాటులోకి వస్తాయని ఉమ్మడి జిల్లా 108 మేనేజర్ బి.నాగేందర్ తెలిపారు.

ఏడాదిలో ఎన్నో చేశా..

సాక్షి INTERVIEW



- తెల్లం వెంకట్రావు

ఎమ్మెల్యేగా ఏడాది కాలంలో చేసిన పనులే తన పనితీరుకు గీటురాయని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అంటున్నారు. కోర్టులో ఉన్న కేసులో తీర్పు ప్రతికూలంగా వచ్చి, ఏ క్షణం ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని, తన గెలుపు నల్లేరు మీద నడకే అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- నా గెలుపును ఎవరూ ఊహించలేదు
- పార్టీ మారేముందు ఎంతో మథన పడ్డాను
- గతంలో భద్రాచలానికి తీవ్ర అన్యాయం
- నియోజకవర్గాన్ని అభివృద్ధి పట్టాలెక్కించా

ఏడాది పాలనపై భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

అనూహ్య గెలుపు..

గడిచిన రెండేళ్లుగా ఇటు వ్యక్తిగతంగా అటు రాజకీయ ఒడిదుడుకులు ఎదురయ్యాయి. రాజకీయ గురువుగా భావించే పొంగులేటి శ్రీనివాసరెడ్డికి దూరం జరగాల్సి వచ్చింది. నాటకీయ పరిస్థితుల మధ్య బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి, అక్కడి నుంచి మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి వచ్చాను. నా గెలుపుపై ఎవరికీ నమ్మకం లేదు. కానీ గతంలో రెండుసార్లు పోటీ చేసిన ఓడిపోయిన అనుభవంతో పక్కా ప్రణాళికతో ప్రచారం నిర్వహించాను. అందరి అంచనాలు తలకిందులు చేస్తూ భద్రాచలం నుంచి ఎమ్మెల్యేగా గెలిచాను.

మారాల్సి వచ్చింది..

భద్రాచలం నుంచి ఎమ్మెల్యేగా ఎక్కువ కాలం కమ్యూనిస్టులకే అవకాశం వచ్చింది. దీంతో ప్రజా పోరాటాల విషయంలో ఈ ప్రాంతం ముందున్నా.. ప్రభుత్వం నుంచి నిధులు తేవడంలో వెనుకబడిపోయింది. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలోనూ ఇదే తంతు కొనసాగింది. కాంగ్రెస్ నుంచి మళ్లీ బీఆర్‌ఎస్‌లో చేరే సమయంలోనూ భద్రాచలం అభివృద్ధి, నిధుల విషయంలో షరతులు విధించాను. కరకట్టకు నిధులు మంజూరు చేసిన తర్వాతే బీఆర్‌ఎస్‌లో చేరాను. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. నా రాజకీయ గురువు పొంగులేటి మంత్రి అయ్యారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత గతంలో మంజూరు చేసిన జీఓలు, శంకుస్థాపన చేసిన పనులను అర్ధంతరంగా రద్దు చేసే పని మొదలైంది. వెంటనే ప్రభుత్వ పెద్దలను కలిసి భద్రాచలానికి మంజూరు చేసిన పనులు రద్దు చేయొద్దని కోరితే సానుకూలంగా స్పందించారు.

ఆంధ్రా వెళ్లిపోదామనుకున్నా..!

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నేను పొంగులేటి మనిషి నంటూ బీఆర్‌ఎస్‌లో నాపై అనుమానం మొదలైంది. మరోవైపు కాంగ్రెస్‌లోకి రమ్మంటూ ప్రభుత్వ పెద్దల నుంచి ఆహ్వానం అందుతోంది. 'కాంగ్రెస్‌లోకి తెల్లం' అంటూ రోజుకో చోట ప్రచారం జరుగుతూనే ఉండేది. ఒక విద్యాధికుడిగా ఇలా పదే పదే పార్టీలు మారుతున్నానంటూ జరిగే ప్రచారం చూసి బాధేసేది. దీంతో తెలంగాణలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఏపీలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి కొత్తగా రాజకీయ జీవితం మొదలు పెట్టాలనే దిశగా ఆలోచనలు సాగాయి. కానీ నన్ను గెలిపించిన భద్రాచలం ఓటర్లకు జవాబుదారీగా ఉండాలి, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్ కండువా కప్పుకున్నాను.

పొదెం అన్నలాంటి వాడు..

మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యతో నాకు ఎలాంటి ఇబ్బందులు లేవు. వయసులో నా కంటే పెద్దవారు. నాకు అన్నలాంటి వారు. రాజకీయాల్లోనూ సీనియర్. ఏ పని ఉన్నా నేనే ఆయన వద్దకు వెళ్లి కలుస్తున్నా. కలిసే పార్టీలో సాగుతున్నాం.

ఏడాదిలో ఏం చేశానంటే..

గోదావరి కరకట్ట నిర్మాణానికి రూ.49 కోట్లు మంజూరు చేయించా. ఈ కరకట్టపై జాతీయ రహదారి వంతెన కోసం మరో రూ.39 కోట్లు వచ్చాయి. పదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్న ఆలయం అభివృద్ధికి రూ.68 కోట్లు వచ్చాయి. వీటితో స్థల సేకరణ చేపడతాం. భద్రాచలం టౌన్‌లో మురుగునీరు, రోడ్ల అభివృద్ధి కోసం రూ.100 కోట్లు విడుదల చేయబోతున్నాం. మూడు పంచాయతీలుగా విడగొట్టిన భద్రాచలాన్ని తిరిగి ఒక్కటి చేశాను. మండల హోదా కల్పించా. కూనవరంతో పాటు చర్ల రోడ్డులో కూడా సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటు చేయబోతున్నాం.

ముందున్న లక్ష్యాలివే..

- మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు
- కరకట్ట వెంబడి సమాంతరంగా రూ.100 కోట్లతో రోడ్డు నిర్మాణం
- ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం
- మిథిలా స్టేడియం పునర్ నిర్మాణం
- పర్యాటక రంగంలో నూతన ప్రాజెక్టులు

పల్లెల్లో అభివృద్ధి పనులు..

స్వాతంత్రం వచ్చి 70 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ పల్లెల్లో వెనుకబాటుతనం ఉంది. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత దుమ్ముగూడెం మండలంలో త్రీఫేస్ కరెంట్ సమస్య ఉందని తెలిసి వెంటనే స్పందించా. ఇప్పుడు మండలంలో 60 శాతం మేర ప్రాంతానికి త్రీఫేస్ విద్యుత్ వచ్చింది. మిగిలిన చోట సోలార్ పవర్ అందిస్తాం. వెంకటాపురం మండలానికి జూనియర్ కాలేజీ మంజూరు చేయించా. చర్ల మండలంలో అటవీశాఖ అనుమతుల కారణంగా ఆగిన నాలుగు వంతెనలకు గ్రీన్ సిగ్నల్ వచ్చేలా చూశా. మండలాల పరిధిలో పంచాయతీరాజ్ ద్వారా రూ.30 కోట్ల విలువైన రోడ్డు పనులకు మంజూరు సాధించాను. విలీన గ్రామాలను తిరిగి తీసుకొచ్చేందుకు నావంతు ప్రయత్నం చేస్తా. నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లు అధికంగా వచ్చేలా ప్లాన్ చేస్తున్నాను.

వైద్యంపై ఫోకస్..

నాలుగు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న భద్రాచలం ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రావాలి. ఆ స్థాయి డాక్టర్లకు కనీసం రూ.5లక్షల వేతనం ఇస్తేనే ఇక్కడికి వస్తారు. ఇందుకోసం ప్రభుత్వంతో మాట్లాడుతా. సీఎస్సార్ నిధులతో త్వరలో సీటీ స్కాన్ ఏర్పాటు చేయబోతున్నాం. ఎంపీతో సమన్వయం చేసుకుని ఎయిమ్స్ క్యాంపస్‌ను భద్రాచలం తెచ్చేందుకు కృషి చేస్తా.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

ఆలయంలో భక్తుల సందడి



భక్తులతో కిక్కిరిసిన ఆలయ క్యూలైన్లు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీకమాసం ముగిసినప్పటికీ.. పోలి పాడ్యమి కావడంతో భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, దీపాలు వెలిగించిన తర్వాత ఆలయానికి చేరుకున్నారు. దీంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. కాగా, అంతరాలయంలోని మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సహస్ర నామార్చన తదితర పూజలు జరిపి, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో జిల్లా ఆస్పత్రి పక్కన నిర్మించిన షెడ్లలో ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళా సంఘాలతో ఫుడ్ కోర్టులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, కౌన్సిలర్ రుక్మాంగధర్ భండారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పామాయిల్ రైతులకు లాభాల 'పంట'

టన్ను ధర రూ.20,413కు పెరుగుదల

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ రైతుల పంట పండుతోంది. గెలల టన్ను ధర కొద్ది నెలలుగా క్రమంగా పెరుగుతుండడంతో సాగుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. దాదాపు రెండేళ్ల తర్వాత సోమవారం టన్ను ధర రూ.20,413గా నమోదైంది. గత నెలలో ఈ ధర రూ.19,144 ఉండగా, ప్రస్తుతం రూ.1,269 పెరగడం విశేషం. గత నెలతో పోలిస్తే ఈ పెరుగుదల తక్కువే అయినా వరుసగా మూడు నెలల నుంచి ధరల పెంపుతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టన్ను ధరను రూ.20వేల వరకు పెరిగేలా కృషి చేస్తానని ఇచ్చిన హామీ నేరవేరింది.

తుమ్మల కృషితోనే పెరుగుదల

ఆయిల్‌పామ్ టన్ను గెలల ధర పెంపునకు మంత్రి తుమ్మల కృషే కారణమని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీ కమిటీ బోర్డు మెంబర్ ఆలపాటి రామచంద్రరావు, ఆయిల్‌పామ్ రైతు సంఘం నాయకులు బండి భాస్కర్ అన్నారు. సోమవారం అశ్వారావుపేట వారు విలేకరులతో మాట్లాడారు. రైతులను రాజుగా మార్చేందుకు తుమ్మల కృషి చేస్తున్నారని, ప్రజాపాలన ఏడాదిలోపే పామాయిల్ గెలల ధర టన్నుకు రూ.20,413గా ఖరారు కావడం ఆయన ఘనతేనని చెప్పారు.



మాట్లాడుతున్న ఆలపాటి, బండి భాస్కర్

రైతులకు రూ.లక్షల రుణమాఫీ, సన్న ధాన్యానికి రూ.500 బోనస్‌తో పాటు పామాయిల్ దర పెంచిన ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

పది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ

- ముందుగా స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు ఇస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్, పీఓ, ఎమ్మెల్యే

టేకులపల్లి: పది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ ప్రారంభిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముందుగా సొంత స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలు అందజేస్తామని, అర్హులైన పేదలందరికీ ఇళ్లు వస్తాయని, ఎవరూ అధైర్య పడొద్దని అన్నారు. సోమవారం ఆయన కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి మండలంలో పర్యటించారు. రూ.11.38 కోట్లతో నిర్మించే సింగ్యాతండా – గొల్లగూడెం, దాసుతండా – ఎర్రబోడు, ఎర్రాయిగూడెం – చింతలకట్ట, ఒడ్డుగూడెం పీఆర్‌రోడ్ – జంగాలపల్లి, సంపత్‌నగర్ – పెద్దచర్లపల్లి, సంపత్‌నగర్ – ఉలవచెలక రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ముత్యాలంపాడు వద్ద రూ.4.20 కోట్లతో నిర్మించిన హైలెవెల్ బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శంకుస్థాపన చేసిన రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. అనంతరం గంగారంలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం కల్పిస్తున్నారా అని ఆరా తీశారు. వసతి గృహంలో పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు బెడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలపై ప్రజలు దరఖాస్తులు అందజేయగా, వాటిని పరిష్కరించాలని తహసీల్దార్ భవానీని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రరావు, ఏఈలు సలార్, నవీన్, సీడీపీఓ కె.ఎం.తార, డీఎస్పీ చంద్రభాను, సీఐలు సురేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు ఎప్పుడో..?

- ఆర్టీసీ కార్మికులకు అందుబాటులో లేని చికిత్సలు
- ఆరు నెలల క్రితమే మంజూరైనా అందుబాటులోకి రాని ఆస్పత్రి
- ప్రస్తుతం ఖమ్మం, తార్నాక ఆస్పత్రులే దిక్కు
- దూరాభారంతో ఉద్యోగులకు తప్పని ఇక్కట్లు



కొత్తగూడెంలో ఆస్పత్రి ఏర్పాటుకు గుర్తించిన పాత స్క్వాడ్ భవనం

చుంచుపల్లి: ప్రగతి రథ చక్రాలు నడుపుతూ నిత్యం వేలాది మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చే ఆర్టీసీ కొలువులు అత్యంత కష్టంతో కూడుకున్నవే. సక్రమంగా లేని రోడ్లపై వందల కిలోమీటర్ల ప్రయాణం.. రేయింబవళ్లు డ్యూటీలు.. సకాలంలో అందని తిండి, నిద్ర.. ఇలా ఆ సంస్థ ఉద్యోగుల తీరే వేరు. ఈ పరిస్థితుల్లో దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువ. చాలా మంది అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటూనే నిత్యం విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. వారికి అప్పుడప్పుడూ సంస్థ నిర్వహించే వైద్య శిబిరాలే దిక్కవుతున్నాయి తప్ప జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండడం లేదు. అనారోగ్య సమస్యలు తలెత్తితే ఖమ్మం, హైదరాబాద్ లేదంటే స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు నెలల క్రితమే ఆస్పత్రి మంజూరు..

ఆర్టీసీ బస్సులో ఒకరోజు ప్రయాణిస్తేనే ఒళ్లు హూనమవుతుంది. ఎప్పుడు గమ్యస్థానం చేరుతామా అని ఆలోచిస్తాం. కానీ డ్రైవర్, కండక్టర్లు మాత్రం నిత్యం ట్రిప్పుల మీద ట్రిప్పులు వేయాల్సిందే. వారు సగటున రోజుకు 300 – 400 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో విధులు నిర్వర్తించేవారైతే ఇంకా ఎక్కువగానే వెళ్లాల్సి వస్తుంది. దీంతో పలువురు ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారు. జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోల పరిధిలో 987 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారి కుటుంబ సభ్యులు మరో 2వేల మంది వరకు ఉంటారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆర్టీసీ యాజమాన్యం ఉచిత వైద్య సేవలు అందిస్తుంది.

ఖమ్మం లేదా తార్నాక..

ఉద్యోగుల కోసం స్థానికంగా ఆస్పత్రి లేకపోవడంతో అనేక ఏళ్లుగా వైద్య సేవల కోసం ఖమ్మం లేదా హైదరాబాద్‌లోని తార్నాక ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. అక్కడ వైద్యనిపుణులు బీపీ, ఈసీజీ, డయాబెటిక్ వంటి 17 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. తద్వారా ఉద్యోగులు, సిబ్బంది ముస్ముందు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను పసిగట్టడంతో ముందే చికిత్స తీసుకునే వీలుంటుంది. హైదరాబాద్‌లోని తార్నాక ఆర్టీసీ దవాఖానలో కార్మికుల హెల్త్ ప్రొఫైల్ నిక్షిప్తంగా ఉంటుంది. ఆ ప్రొఫైల్ ఆధారంగానే మెరుగైన చికిత్స అందిస్తుంటారు. అయితే జిల్లాలోని కార్మికులకు అలాంటి వైద్య సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో సాధారణ సమస్యలైన బీపీ, షుగర్ వంటి వ్యాధుల నివారణకు అవసరమైన మందులకు సైతం ప్రతీ నెల ఖమ్మం ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. ఇక పెద్ద జబ్బయితే హైదరాబాద్ తార్నాక ఆస్పత్రే దిక్కవుతోంది. కాగా, ఎక్కువ మంది ఉద్యోగులు అంత దూరం వెళ్లలేక స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

అన్నీ సిద్ధంగా ఉన్నా..

ఆర్టీసీ సంస్థ ఆరు నెలల క్రితం కొత్తగూడేనికి ఆస్పత్రిని మంజూరు చేయగా, డిపో మేనేజర్ విభాగంలో ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ఒక డాక్టర్‌తో పాటు కొందరు వైద్య సిబ్బందిని కూడా నియమించారు. గత వర్షాకాలంలో స్లాబ్ పూర్తిగా కురవడంతో ఆస్పత్రిని అక్కడి నుంచి తొలగించారు. తిరిగి ఆర్టీసీ స్క్వాడ్‌కు చెందిన పాత భవనంలో ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నా ఇంకా అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీసీ ఆస్పత్రిని త్వరతగతిన అందుబాటులోకి తేవాలని ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు. దీనిపై కొత్తగూడెం డీఎం దేవేందర్‌గౌడ్‌ను వివరణ కోరగా.. నెల రోజుల్లో ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

ఖమ్మం వెళ్లాల్సి వస్తోంది..



ఏదైనా అనారోగ్య సమస్య, ఇతర ఇబ్బందులు వస్తే వైద్య సేవల కోసం ఖమ్మం వెళ్లాల్సి వస్తోంది. దాంతో పాటు బీపీ, షుగర్ వంటి మందులు కూడా నెలనెలా అక్కడే తీసుకుంటున్నాం. స్థానికంగా వైద్య సేవలు అందుబాటులో లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఇక పెద్ద జబ్బులైతే స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించక తప్పడం లేదు.
– జి.రమేష్‌బాబు, ఆర్టీసీ డ్రైవర్, కొత్తగూడెం

ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలి



జిల్లాలోని నాలుగు డిపోల్లో దాదాపు వెయ్యి మంది ఆర్టీసీ కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వైద్యం కోసం కొందరు ఖమ్మం, హైదరాబాద్ వెళ్తుండగా, మరికొందరు స్థానికంగా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. కొత్తగూడెంలో ఆస్పత్రి అందుబాటులోకి తేవాలి.
– కె.భాస్కర్‌రావు, ఈయూ రాష్ట్ర కార్యదర్శి

విజయోత్సవ వెలుగులు !





జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్న వేళ.. కలెక్టరేట్‌తో పాటు పాల్వంచలోని కేటీపీఎస్ ఏడో దశ ప్రధాన కార్యాలయం విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. సోమవారం వాటిని అందంగా ముస్తాబు చేయగా పలువురు ఆసక్తిగా తిలకించారు.
– సూపర్‌బజార్(కొత్తగూడెం)/పాల్వంచ

క్లుప్తంగా

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్

భద్రాచలం: గిరిజనుల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ సూచించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అర్జీలను పరిశీలించి సంబంధిత యూనిట్ అధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. పోడు భూముల పట్టాలు, తదితర సమస్యలపై గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మణెమ్మ, నాగార్జున రావు, రవీంద్రనాథ్, భాస్కర్, మునీర్ పాషా, ఉదయ్ కుమార్, లక్ష్మీనారాయణ, అశోక్ కుమార్, ఆదినారాయణ, మణిధర్, లింగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సాఫ్ట్‌బాల్, సైక్లింగ్ ఎంపిక పోటీలు

కొత్తగూడెంఅర్బన్: ఉమ్మడి జిల్లా స్థాయి పాఠశాలల అండర్ – 14, 17 బాలబాలికల సాఫ్ట్ బాల్, సైక్లింగ్ పోటీలు కొత్తగూడెం రుద్రంపూర్‌లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహిస్తున్నట్లు డీఈఓలు సోమశేఖర శర్మ, వెంకటేశ్వరాచారి తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారితో ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేస్తామని వెల్లడించారు. కాగా, క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్, ఫొటోతో కూడిన అర్హత పత్రం, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని, పుట్టిన రోజు ధ్రువపత్రం లేకపోతే అనుమతించబోమని తెలిపారు. వివరాలకు పాఠశాలల క్రీడా కార్యదర్శులు వాసిరెడ్డి నరేష్‌కుమార్, నర్సింహమూర్తి లేదా 94934 66866, 93983 07367, 99512 74678 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సీఎం కప్ టోర్నీకి ఎంపిక



లక్ష్మీప్రణయ్

కరకగూడెం: ఈ నెల 7న నిర్వహించే సీఎం కప్ టోర్నీకి మండల కేంద్రానికి చెందిన గిరిజన యువకుడు గోగ్గలి లక్ష్మీ ప్రణయ్ ఎంపికయ్యాడు. గత నెల 30న ఎల్బీ స్టేడియంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రయల్స్‌లో పవర్ లిఫ్టింగ్ 74 కేజీ జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా యువకుడిని తల్లిదండ్రులు పద్మ, రవి, కోచ్ నితీష్ తదితరులు అభినందించారు.

ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లకు పోస్టింగ్ ఆర్డర్లు



జూనియర్ అసిస్టెంట్‌కు పోస్టింగ్ ఆర్డర్ అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

కొత్తగూడెంరూరల్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగ అర్హత పొందిన సాయి మనోహర్, ఎ.నవ్య, జి.వెంకటేష్‌లకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్ సోమవారం పోస్టింగ్ ఆర్డర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుదర్శన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుకృత, సీనియర్ అసిస్టెంట్ రత్నం రాజు, శ్యామల, సమ్రీన్ పాల్గొన్నారు.

ఇసుక నిల్వలు సీజ్



ఇసుక నిల్వలను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

బూర్గంపాడు: సారపాకలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సోమవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ట్రాక్టర్లతో గోదావరి నుంచి తరలించి నిల్వ ఉంచిన ప్రాంతాలను డిప్యూటీ తహసీల్దార్ రామ్‌నరేష్, ఆర్‌ఐ ముత్తయ్యలు పరిశీలించి ఇసుక రాశులను సీజ్ చేశారు. ఐటీసీ లారీ యార్డ్ ప్రాంతంలో భారీగా ఉన్న ఇసుక నిల్వలను అధికారులు ముగ్గు వేసి సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని డీటీ హెచ్చరించారు.

గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సోమవారం పట్టణ పోలీసులు 13 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సులో అక్రమంగా హైదరాబాద్‌కు గంజాయి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి రూ.3 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు.

తక్కువ ధరకే కొంటున్నారు..

- ప్రైవేటు వ్యాపారులు, దళారుల మోసాలపై రైతుల ఆవేదన
- ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం
- కఠిన నిబంధనలతో ప్రైవేటు వైపు మొగ్గుచూపుతున్న అన్నదాతలు
- మద్దతుధరతోపాటు బోనస్ కూడా నష్టపోతున్న రైతులు



దంతెలబోరు కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉన్న ధాన్యం రాశులు

పాల్వంచరూరల్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. ఇదే అదునుగా దళారులు, వ్యాపారులు పొలాలు, ఇళ్ల వద్దకు వెళ్లి సగం ధరకే కొంటున్నారు. దీంతో రైతులు మద్దతు ధరతోపాటు బోనస్ కూడా నష్టపోతున్నారు. జిల్లాలో వానాకాలంలో 1,61,550 ఎకరాల్లో విస్తీర్ణంలో వరి సాగు చేశారు. 3,25,000 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా చేశారు. సేకరణ లక్ష్యం 2,95,000 మెట్రిక్ టన్నులు కాగా ఇప్పటివరకు 81 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సోమవారం వరకు 17,044 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొన్నారు. 160 కొనుగోలు కేంద్రాలకు గాను కేవలం 81 కేంద్రాల్లోనే కొనుగోళ్లు జరుగుతున్నాయి.

పొలాలు, ఇళ్ల వద్దకే ప్రైవేటు వ్యాపారులు..

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యాపారులు, దళారులు రైతుల వద్దకే వస్తున్నారు. ఇళ్లు, పొలాల వద్దే కొంటున్నారు. 77 కేజీల బస్తా ధాన్యం రూ.1600 నుంచి రూ.1900 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. పచ్చి వడ్లు కొంటున్నామని, తరుగుపోతుందంటూ వ్యాపారులు రైతులను దోపిడీ చేస్తున్నారు. పాల్వంచ మండలం నారాయణరావుపేటలో శనివారం ఓ ప్రైవేట్ వ్యాపారి క్వింటాకు కేజీన్నర అదనంగా తూకం వేసి మోసం చేశాడు. రైతులు గుర్తించి పట్టుకుని తూకాన్ని బట్టి నగదు వసూలు చేశారు. ఇలా వ్యాపారులు మోసం చేస్తుండగా, పలుచోట్ల రైతులు గుర్తించలేకపోతున్నారు. ఒకవేళ గుర్తించి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటా ధాన్యం ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకం క్వింటాకు రూ. 2,300 చొప్పున ధర చెలిస్తున్నారు. అదనంగా మరో రూ.500 బోనస్ ఇస్తున్నారు. అయితే పంట పెట్టుబడి, ఎరువులు, పురుగుమందులకు అప్పు ఇచ్చిన వ్యాపారులు సగం ధరకే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కాగా ధాన్యం కొనుగోళ్లు చివరకు దశకు వచ్చినట్లు తెలుస్తోంది.

నిబంధనల కారణంగానే ప్రైవేట్ వైపు..

నిబంధనల కారణంగానే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడంలేదని రైతులు చెబుతున్నారు. తాలు గింజలు, కల్తీ గింజలు, ఇతర వ్యర్థాలు లేకుండా శుభ్రపరిచి, తేమశాతం 17లోపు ఉంటే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుంది. పొలం వద్దనే గ్రేడింగ్ చేసుకుని తీసుకురావాలని నిబంధనలు విధించారు. ఇక పాస్‌బుక్‌లు లేని రైతులు వ్యవసాయ విస్తీర్ణాధికారి ద్వారా ధ్రువీకరణ పత్రం ధాన్యం విక్రయించుకోవాల్సి ఉంటుంది. మట్టి పెళ్లలు, రాళ్లు 1 శాతం, చెత్త, తాలు ఒక శాతం, చెడిపోయిన రంగుమారిన, తక్కువ రకాల మిశ్రమ ధాన్యం 6 శాతం లోపు ఉండాలని నిబంధనలు విధించారు. ఏజెన్సీలో ఎక్కువ మందికి పట్టాలు లేకపోవడం, కఠినమైన నిబంధనలతో వ్యాపారులకే విక్రయించుకోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



వ్యాపారులు ధాన్యానికి మద్దతు ధరలో సగమే చెల్లిస్తున్నారు. నారాయణరావుపేటలో బస్తాకు కేజీన్నర ఎక్కువ తూకం వేసి మోసం చేశారు. దళారుల మోసంపై తహసీల్దార్, సివిల్ సప్‌లై డీటీలకు సమాచారం అందిస్తే స్పందించడంలేదు. దిక్కున్న చోట చెప్పుకోండంటూ కించపరిచి మాట్లాడుతున్నారు.

– గంగుళ్ల వెంకటేశ్వరరెడ్డి, రైతు

నిబంధనలతో రైతులకు నష్టం



నిబంధనల కారణంగా ఎక్కువ మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు వడ్లు అమ్ముకుంటున్నారు. నేను 70 క్వింటాళ్ల ధాన్యం ప్రైవేట్ వ్యాపారికి ఇచ్చి రూ.96 వేలు నష్టపోయాను. 77 కేజీల బస్తాకు రూ.1700లే ఇస్తున్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకెళ్లాలంటే ట్రాక్టర్, హమాలీ కూలీల ఖర్చుల కూడా అధికంగా ఉన్నాయి.

– ఎస్.వెంకట్‌రెడ్డి, రైతు

వేగంగా కొనుగోళ్లు



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుంది. జిల్లాలో 160 కొనుగోలు కేంద్రాలకుగాను 81 కేంద్రాలు ఏర్పాటు చేశాం. 17,044 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. ఇంకా వరి కోతలు సాగుతున్నాయి. మిగిలి న కేంద్రాలనూ ప్రారంభిస్తాం. ప్రస్తుతం కొనుగోలు ప్రక్రియ వేగంగానే సాగుతోంది.

– ఎస్.త్రినాథ్‌బాబు, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్

మరింత చేరువగా పశువైద్య సేవలు



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

దుమ్ముగూడెం : పశువైద్య సేవలను రైతులకు మరింత చేరువ చేసేందుకు పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం సహకారంతో జాతీయ సేవా పథకంలో భాగంగా ప్రత్యేక పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మల్లయ్య తెలిపారు. సోమవారం మండలంలోని చిన్న బండిరేవు, రామకృష్ణాపురం గ్రామాల్లో శిబిరాలను నిర్వహించారు. పశువైద్య కళాశాల అధ్యాపక బృందం, పశువైద్యాధికారులు పశువులకు వైద్య సేవలను అందించారు. పెరటి కోళ్ల పెంపకం, పశు పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు అమృత్‌కువార్, సురేష్, లత, అశోక్, హనుమంతరావు, అలెగ్జాండర్, వంశీకృష్ణ, రాజశ్రీ, శ్రీనివాస్, రమేష్, శివజ్యోతి, రామిరెడ్డి, తేజ, అరుణ, యశస్విని, ఠాగూర్, బట్టులాల్, సుధారాణి, సంతోష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీకొట్టిన కారు

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి కారణమైన కారు



ట్రాన్స్‌ఫార్మర్ సమీపాన ఆగిన స్కూల్ బస్సు

సత్తుపల్లిటౌన్: విద్యార్థులతో వస్తున్న స్కూల్ బస్సును కారు ఢీకొట్టగా, తృటిలో పిల్లలు ప్రమాదం నుంచి బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం సత్తుపల్లి నుంచి గంగారం వైపు వెళ్తున్న కారు స్థానిక హనుమాన్‌నగర్ బంక్ వద్ద అడ్డొచ్చిన సైక్లిస్ట్‌ను తప్పించే క్రమాన గంగారం వైపు నుంచి సత్తుపల్లి వస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల బస్సును వేగంగా ఢీకొట్టింది. దీంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టింది. ఆ వెంటనే డ్రైవర్ చాకచక్యంగా బస్సును వెనక్కి తీసుకురావడంతో పిల్లలకు ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో ఆందోళనకు గురైన విద్యార్థులను కిందకు దింపి మరో వాహనంలో పంపించారు. కాగా, ఘటనలో కారు ముందు నుజ్జునుజ్జు కాగా, పోలీసులు చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు.

చిన్నారిపై లైంగిక దాడి

కామాంధుడికి దేహశుద్ధి, పోక్సో కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: అభంశుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై ఓ కామాంధుడు దారుణానికి పాల్పడ్డాడు. రోడ్డుపై ఆటలాడుకుంటున్న చిన్నారికి కూల్ డ్రింక్ ఆశ చూపించి, ఇంట్లోకి తీసుకెళ్లి తండ్రి వయస్సు ఉన్న ఓ వ్యక్తి లైంగిక దాడి చేశాడు. ఈ ఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై యయాతిరాజు కథనం ప్రకారం.. మండలంలోని ఓ గిరిజన గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారిని ఆదివారం నానమ్మ వద్ద ఉంచి తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో వీధిలో ఆడుకుంటున్న చిన్నారిని అదే గ్రామానికి చెందిన 35ఏళ్ల అవివాహితుడు సమీపంలో ఉన్న దుకాణానికి తీసుకెళ్లి శీతలపానియం ఇప్పించాడు. అనంతరం మాయమాటలు చెప్పి దగ్గర్లోనే ఉన్న తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక విషయం చెప్పడంతో, ఈ దారుణానికి పాల్పడిన వ్యక్తికి దేహశుద్ధి చేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్సై గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించి, నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

సెల్‌టవర్‌ను దగ్ధం చేసిన మావోయిస్టులు



కాలిపోయిన సెల్ టవర్ ప్యానల్ బోర్డు

చర్ల: పీఎల్‌జీఏ వారోత్సవాల ప్రారంభం రోజే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు విధ్వంసానికి పాల్పడ్డారు. ఆదివారం అర్ధరాత్రి బీజాపూర్ జిల్లా తోయ్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోర్మెట్‌లో సెల్ టవర్ దగ్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్‌తో ఆదివాసీ గ్రామాల్లో కమ్యూనికేషన్ సౌకర్యాన్ని కల్పించేందుకు ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన మొబైల్ టవర్ ఏర్పాటు చేసింది. పీఎల్‌జీఏ వారోత్సవాలకు పిలుపునిచ్చిన మావోయిస్టులు తొలిరోజే ఆ సెల్ టవర్‌తో పాటు కంట్రోల్ రూం, ప్యానల్ బోర్డు వద్ద పెద్ద కలప దుంగలను వేసి నిప్పంటించారు. టవర్ వద్ద పీఎల్‌జీఏ వారోత్సవాలను విజయవంతం చేయాలంటూ వెస్ట్ బస్తర్ డివిజన్ కమిటీ పేరిట కరపత్రాలు వదిలారు. ఈ ఘటనపై మొబైల్ కంపెనీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినులను కొట్టిన వాచ్ ఉమెన్

కొత్తగూడెంరూరల్: ఎస్సీ వసతి గృహంలో విద్యార్థినులు క్యారెట్లు తిన్నారని అక్కడి వాచ్ ఉమెన్ కొట్టిన ఘటనపై సోమవారం ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. కొత్తగూడెంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో శనివారం విద్యార్థినులు క్యారెట్లు తిన్నారంటూ వాచ్‌ఉమెన్ వచ్చి చెంపపై కొట్టింది. బూతులు తిట్టింది. ఈవిషయంపై హాస్టల్ వార్డెన్ సునీతను వివరణ కోరగా.. సదరు వాచ్ ఉమెన్‌ను మరో హాస్టల్‌కు పంపించామని, భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతుపై దాడి

సుజాతనగర్: ఓ రైతుపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడగా, సుజాతనగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం.రమాదేవి కథనం ప్రకారం.. మండలంలోని డేగలమడుగు గ్రామానికి చెందిన గోసుల రాములు ట్రాక్టర్‌లో పత్తి తీసుకుని మంజీత్ కాటన్ జిన్నింగ్ మిల్లు వద్దకు అమ్మేందుకు వచ్చాడు. ఈ క్రమంలో గేటు వద్దకు వచ్చాక ట్రాక్టర్ ఓ పక్కకు ఒరగగా, రైతు తాడు సాయంతో సరిచేస్తున్నాడు. ఈ క్రమంలో వాహనం వెనుక మరో వాహనంలో ఉన్న లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామానికి చెందిన డ్రైవర్ ధారావత్ సురేష్ ట్రాక్టర్ తీయాలంటూ రాములుతో వాగ్వాదానికి దిగాడు. దీంతో గొడవ జరుగుతుండగా రాములు బంధువైన గోసుల నరేష్ అక్కడికి వచ్చి ఆపే ప్రయత్నం చేశాడు. కాగా సురేష్ మిల్లు వద్ద ఉన్న తన స్నేహితుడు భూక్యా శివకు ఫోన్ చేసి పిలిపించుకుని ఇద్దరూ కలిసి రాములు, నరేష్‌లపై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన సురేష్, శివలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

పాల్వంచరూరల్: రాంగ్ రూట్‌లో వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రుద్రంపూర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి పెండం రవి గత నెల 20న పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ద్విచక్ర వాహనంపై మణుగూరు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో రవి కుడి కాలు, చేయి విరిగాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన, పడమటి నర్సాపురం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ మణికంఠపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.సురేష్ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామశివారులో పేకాట స్థావరంపై సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రూ.24 వేల నగదు, 5 సెల్‌ఫోన్లు, మూడు బైకులు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: ఎనిమిది మంది పేకాటరాయుళ్లపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ యాయతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురం కాలనీ గ్రామంలో ఉన్న కమ్యూనిటీ భవనంలో ఆదివారం సాయంత్రం దాడి చేశారు. ఇద్దరిని అరెస్ట్ చేయగా, మరో ఆరుగురు పారిపోయారు. రూ.2900 నగదు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 8 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి



సతీష్‌కుమార్ (ఫైల్)

అశ్వాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మణుగూరు అశోక్ నగర్‌కు చెందిన నల్లెల సతీష్‌కుమార్ (42) భారజల కర్మాగారంలో ఓ కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 28న విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా జగ్గారం క్రాస్‌రోడ్ వద్ద కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని హైదరాబాద్‌కు తరలించి చికిత్స నిర్వహిస్తున్న క్రమంలో సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

రైలుకింద పడి యువకుడు...

కొత్తగూడెంఅర్బన్/పాల్వంచ: రైలుకింద పడి ఓ గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. ఆదివా రం రాత్రి సమయంలో పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని గాజులగూడెం, పాండురంగాపురం రైల్వే స్టేషన్ల మధ్య ఈ సంఘటన జరిగింది. మృతుడు సిమెంట్ రంగు టీషర్ట్, బ్లాక్ కలర్ పాయింట్, మెరూన్ కలర్ పుమా స్వెట్టర్ ధరించి ఉన్నాడు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదుతో జీఆర్‌పీ ఎస్‌ఐ జె.సురేష్, ఆర్పీఫ్ ఏఎస్‌ఐ జి.నరసింహస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రధానాస్పత్రిలో మార్చురీలో ఉంచారు. ఆచూకీ తెలిసిన వారు 99890 25448కు సమాచారం అందించాలని కోరారు.

వరల్డ్ రికార్డ్స్‌లో 'బ్రిలియంట్'కు చోటు



అవార్డు అందుకుంటున్న బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్, విద్యార్థులు

బూర్గంపాడు: వరల్డ్ ఎన్విరాన్మెంటల్ ఆర్గనైజేషన్ దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో సారపాకలోని బ్రిలియంట్ విద్యాసంస్థకు చోటు దక్కింది. దేశవ్యాప్తంగా వెయ్యి మంది విద్యార్థులను, సంస్థలను స్కాలర్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు ఎంపిక చేశారు. ఇందులో జిల్లా నుంచి బ్రిలియంట్ విద్యాసంస్థ విద్యార్థులకు చోటు దక్కింది. డాక్టర్ అమృతరావు ఎడ్యుకేషన్ సొసైటీ, మెంటరాక్స్ ఎవర్ గ్రీన్ ఒలివ్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో హోవర్ టెక్ ఫౌండర్ డాక్టర్ మునీష్ జిందాల్ చేతుల మీదుగా బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బి.నాగేశ్వరరావు, విద్యార్థులు రాజ్‌దీప్‌రెడ్డి, చరణ్‌తేజ, శాలిని, జ్యోతిర్మయి, శ్రావ్యశ్రీ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

ఐఏఎల్ ప్రధాన కార్యదర్శిగా ఉదయభాస్కరరావు

కొత్తగూడెంఅర్బన్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన ఎలమోలు ఉదయ భాస్కర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హనుమకొండ జిల్లాలో జరిగిన ఐఏఎల్ రెండో రాష్ట్ర మహాసభల్లో సూర్యాపేట జిల్లాకు చెందిన బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షుడిగా, భాగం మాధవరావు సహాయ కార్యదర్శిగా, మునిగడప వెంకటేశ్వర్లు, ఉప్పు శెట్టి సునీల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉదయ్ భాస్కరరావు విద్యార్థి దశ నుంచే కమ్యూనిజం భావాలతో అనేక విద్యార్థి, ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు.

7న 'వేస్ట్ టు వెల్త్'పై ప్రదర్శన

కొత్తగూడెంఅర్బన్: నేషనల్ గ్రీన్ కార్ప్స్(ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో ఈనెల 7న కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో వేస్ట్ టు వెల్త్ అనే అంశంపై ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సైన్స్ ఫేర్‌లో వేస్ట్ టు వెల్త్ అనే అంశంపై ప్రదర్శనలు ఇచ్చిన ఎన్‌జీసీ పాఠశాలల ఎకో క్లబ్ విద్యార్థులు సైతం ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పనికి రాని వస్తువులతో ఆకర్షణీయంగా తయారు చేసిన వాటిని ప్రదర్శనకు తీసుకరావచ్చని పేర్కొన్నారు. 7వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రదర్శన ప్రారంభం అవుతుందని, ప్రతి ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఒక్కో ఎగ్జిబిట్ మాత్రమే తీసుకురావాలని సూచించారు. ఒక్కో పాఠశాల నుంచి ఒక విద్యార్థి, గైడ్ టీచర్ మాత్రమే పాల్గొనాలని స్పష్టం చేశారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు(92472 96012)ను సంప్రదించాలని సూచించారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

దమ్మపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, ప్రస్తుతం కొనసాగిస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, తిరిగి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు డిమాండ్ చేశారు. సోమవారం దమ్మపేటలో నిర్వహించిన యూటీఎఫ్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఈ కుబేర్ బిల్లులు, కరువు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 8న జరిగే యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, కోశాధికారిగా వినోద్, ఉపాధ్యక్షులుగా వెంకటనర్సమ్మ, సురేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆడిట్ కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, రిటైర్డ్ ఉద్యోగి కల్యాణం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లవర్స్‌కు అనుమతి లేదు !



పార్క్ ఫెన్సింగ్‌కు కట్టిన బోర్డు

ఎక్కడైనా పార్క్‌ల వద్ద సైకిళ్లు, వాహనాలు తీసుకురావొద్దని, చెత్తాచెదారం పడేయొద్దనే సూచనలతో బోర్డులు చూస్తుంటాం. కానీ ఖమ్మంలోని మున్సిపల్ కార్పొరేషన్ పక్కన ఉన్న ఫ్రీడమ్ పార్క్ వద్ద ఏర్పాటుచేసిన బోర్డును మాత్రం ప్రతీ ఒక్కరు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. ఇక్కడ బోర్డుపై సైకిళ్లు పార్క్ లోపలికి తీసుకురావొద్దని, సాయంత్రం 4 గంటల తర్వాత క్రికెట్ ఆడొద్దనేవి రెండు సూచనలు ఉన్నాయి. ఇక మూడోది మాత్రం 'లవర్స్‌కు అనుమతి లేదు' అని రాశారు. పార్క్‌కు చిన్నాపెద్ద వాకింగ్ కోసం వస్తుండగా గంటల తరబడి తిష్ట వేస్తున్న కొన్ని జంటలు ప్రవర్తిస్తున్న తీరుతో ఇబ్బందులు వస్తుండడంతోనే ఇలా బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

– ఖమ్మంమయూరిసెంటర్

క్లుప్తంగా...

మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డికి వీడ్కోలు..

అమెరికా వెళ్లిపోతున్న బీఆర్‌ఎస్ నేత



వీడ్కోలు సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రధాన కార్య దర్శిగా, తెలంగాణ భవన్ ఇన్‌చార్జిగా సుమా రు 24 ఏండ్ల పాటు పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ నేతలు సోమ వారం తెలంగాణ భవన్‌లో వీడ్కోలు పలికా రు. మాజీ మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన జరి గిన వీడ్కోలు సమావేశంలో పలువురు నేతలు పార్టీకి శ్రీనివాస్‌రెడ్డి అందించిన సేవలను గు ర్తు చేసుకున్నారు. శేష జీవితాన్ని అమెరికాలో గడిపేందుకు వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డిని తెలంగాణ ఉద్యమ అనుభవాలను క్రోడీకరించి పుస్త కం రాయాల్సిందిగా నాయకులు కోరారు. తె లం గాణ ఉద్యమంలో శ్రీనివాస్‌రెడ్డి అనేక కీల క ఘట్టాలకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్నారన్నారు. మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పద్మారావు గౌడ్, ఎమ్మెల్సీలు మధుసూదనా చారి తదితరులు శ్రీనివాస్‌రెడ్డితో తమకున్న అనుబం ధాన్ని వివరించారు. కాగా, తనకు మంచి గుర్తిం పును ఇచ్చిన పార్టీ అధినేత కేసీఆర్‌కు మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పన్ను వసూళ్లలో 15 శాతం వృద్ధి

ఐటీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పన్ను వసూళ్లలో తెలంగాణ మంచి వృద్ధిరేటు చూపుతోందని, గతేడాదితో పోలిస్తే 15 శాతం వృద్ధి సాధించిందని ఆదాయ పన్ను శాఖ తెలంగాణ, ఏపీల ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత తెలిపారు. తెలం గాణ, ఏపీ కలిపి ఈ ఏడాది పన్ను వసూళ్ల లక్ష్యం రూ.1,21,000 కోట్లు కాగా, ఇందులో ఇప్పటివరకు రూ.59,000 కోట్ల మార్కును చేరుకున్నామని చెప్పారు. పూర్తి లక్ష్యాన్ని చేరుకుం టామనే ఆశా భావంతో ఉన్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) సోమవారం ఉదయం ఆదాయపు పన్నుపై నిర్వహించిన సమావేశంలో మధుస్మిత మాట్లాడారు. రెండు రాష్ట్రాల్లో కలిపి రూ. 2 లక్షల కోట్ల పన్ను పెండిం గ్‌లో ఉందని తెలిపారు. వ్యాపారాన్ని సులభతరం చేయడం అనేది భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆదా యపు పన్ను శాఖ నినాదం అని ఆమె చెప్పారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య

- మరో ఘటనలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



నారాయణ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పోచారం/నిజాంపేట/బీబీనగర్/భానుపురి (సూ ర్యాపేట): వేర్వేరు కాలేజీల్లో ఇద్దరు ఇంటర్ విద్యా ర్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మరో ఘటనలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.

అన్నోజిగూడ నారాయణ కళాశాలలో...



తనుష్‌నాయక్ (ఫైల్ ఫొటో)

బీబీనగర్ మండలంలోని పెద్దపలుగు తండాకు చెందిన బానోతు తనుష్‌నాయక్ (16) తల్లిదండ్రులు నగరానికి వలస వచ్చి కుషాయిగూడలోని చక్రీపురంలో ఉంటున్నారు. అన్నోజిగూడలోని నారాయణ జూనియర్ కళాశాలలో తనుష్‌ను ఇంటర్ ఫస్టియర్(ఎంపీసీ)లో చేర్పించారు. సోమవారం సాయంత్రం హాస్టల్ బాత్‌రూమ్‌లోకి వెళ్లిన తనుష్ ఎంత సేపటికీ బయటకు రాలేదు. దీంతో తోటి విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది తలుపులు పగుల గొట్టి చూడగా..తనుష్ ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో నేరుగా గాంధీ ఆస్పత్రికి తరలించారు. తనుష్‌కు ఫిట్స్ వచ్చాయని కళాశాల నిర్వాహకులు చెబుతుండగా..అధ్యాపకుల ఒత్తిడి కారణంగానే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు.

ఎస్ఎస్ఆర్ కళాశాలలో...

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం చిన్నతడం గ్రామానికి చెందిన ప్రజ్ఞారెడ్డి ప్రగతినగర్‌లోని ఎస్ఎస్ఆర్ ఇంపల్స్ ఐఐటీ గర్ల్స్ క్యాంపస్‌లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతూ కళాశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటోంది. సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో ప్రజ్ఞారెడ్డి తాను ఉంటున్న హాస్టల్ గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే విద్యార్థిని మృతి చెందిన విషయాన్ని దాచి పెట్టిన కళాశాల యాజమాన్యం హుటాహుటిన మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించింది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకుందా లేక ఇతరత్రా కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఎస్ఎస్ఆర్ ఇంపల్స్ ఐఐటీ క్యాంపస్‌కు ఇంటర్ బోర్డు అనుమతి లేదని సమాచారం.

ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో....

సూర్యాపేట జిల్లా కోదాడ స్నేహ నర్సింగ్ కళాశాలలో అసోం రాష్ట్రానికి చెందిన నర్గిస్ పర్వీన్ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజులుగా ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం ఒత్తిడి చేయడంతో బుధవారం రాత్రి కాలేజీ హాస్టల్‌లో శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను సూర్యాపేట ఆస్పత్రిలో చేర్పించగా..కోలుకుంది. మళ్లీ ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం డిమాండ్ చేయడంతో సోమవారం గ్రీవెన్స్‌డేలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు కాలేజీకి చెందిన పలువురు విద్యార్థులతో కలిసి ఆమె సూర్యాపేటలోని కలెక్టరేట్‌కు వచ్చింది. వారంతా కలిసి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఆ తర్వాత కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో బాధిత విద్యార్థిని తన వెంట తెచ్చుకున్న శానిటైజర్ తాగి మళ్లీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో వెంటనే కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది ఆమెను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నర్గిస్ పర్వీన్‌ను కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పరామర్శించారు.

రాష్ట్ర వన్యప్రాణి బోర్డు పునర్వ్యవస్థీకరణ

సభ్యులుగా పలువురు ఎమ్మెల్యేలు, స్వచ్ఛంద సంస్థలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వన్యప్రాణి బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. మూడేళ్లపాటు కొనసాగనున్న ఈ బోర్డు... ఏడాదికి కనీసం రెండు సార్లు సమావేశం కావాల్సి ఉంటుంది. రాష్ట్రంలో రక్షిత ప్రాంతాల ప్రకటన, వన్యప్రాణుల సంరక్షణ, ఏవైనా ప్రత్యేకతలున్న మొక్కల పరిరక్షణ, ఏదైనా షెడ్యూల్‌కు సవరణలు, అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు, ఇతర ప్రజల అవసరాలకు తగ్గట్టు గా తగిన చర్యలు, రాష్ట్ర ప్రభుత్వం చేసే సూచనలు వంటి వాటిని ఈ బోర్డు పరిశీలించనుంది. తదను గుణంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయా అంశాలపై సలహాలు, సూచనలు ఇవ్వనుంది. బోర్డు చైర్మన్‌గా ముఖ్యమంత్రి, వైస్ చైర్‌పర్సన్‌గా అటవీ, పర్యావ రణశాఖ మంత్రి కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ బోర్డులో సభ్యులుగా... ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు (ఖానాపూర్), సీహెచ్ వంశీకృష్ణ (అచ్చంపేట) మురళీనాయక్ (మహబూబాబాద్)లను నియమించారు. వన్యప్రాణులతో ముడిపడిన రంగాలు, కార్యకలాపాల్లో నిమగ్నమైన స్వచ్ఛంద సంస్థల నుంచి... డబ్ల్యూడబ్ల్యూఎఫ్ హైదరాబాద్ ఆఫీస్ స్టేట్ డైరెక్టర్ ఫరీదా తంపాల్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ సంస్థాపక కార్యదర్శి ఇమ్రాన్ సిద్దిఖీ, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి అవినాష్ విశ్వనాథన్‌లు సభ్యులుగా నియమి తులయ్యారు. పర్యావరణవేత్తలు... లాకోన్స్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.ఉమాపతి, విశ్రాంత ఐఎఫ్ఎస్ ఎంఏ వహీద్, నెహ్రూ జూపార్క్ వెటర్నరీ కన్సల్టెంట్ డా.నవీన్‌కుమార్, ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.వాసుదేవ రావు, ఈ కేటగిరీలో ఇంకా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు (పినపాక), రాందాస్ మాలావత్ (వైరా)లను సభ్యులుగా నియమించారు. ఇంకా... ఇతర సభ్యులుగా అటవీ, గిరిజన, ఇతర శాఖల ప్రతినిధులు, పీసీసీఎఫ్ నియమితులయ్యారు. ఈ బోర్డు సభ్యకార్యదర్శిగా చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ (అరణ్యభవన్) వ్యవహరిస్తారు. సోమవారం ఈ మేరకు అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీచేశారు.

తేలని 'విభజన' చర్చలు!

- తెలంగాణ, ఏపీ సీఎస్‌ల ఆధ్వర్యంలోని కమిటీ భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన అంశాలపై జరిగిన తెలంగాణ, ఏపీ సీఎస్‌ల ఆధ్వర్యంలోని కమిటీ భేటీ ఏమీ తేల్చకుండానే ముగిసింది. కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం వ్యక్తమైనా ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు. వచ్చే సమావేశం నాటికి ఆయా అంశాలపై నిర్దిష్టమైన ప్రతిపాదనలతో రావాలని తీర్మానించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ జరిగి పదిన్నరేళ్లు అవుతున్నా చాలా సమస్యలు అలాగే ఉండిపోయిన విషయం తెలిసిందే. అలా అపరిష్కృతంగా ఉన్న అంశాలపై చర్చించేందుకు... ఇరు రాష్ట్రాల సీఎస్‌ల ఆధ్వర్యంలోని అధికారుల కమిటీ సోమవారం ఏపీలోని మంగళగిరిలో ఉన్న ఏపీఐఐసీ కార్యాలయంలో సమావేశమైంది.

15 అంశాలపై చర్చించినా..

సుమారు రెండు గంటల పాటు జరిగిన కమిటీ భేటీలో... ఇరు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న 15 అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు చర్చల్లో పాల్గొన్న తెలంగాణ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. విభజన జరిగి పదేళ్లు పూర్తయినందున త్వరగా సమస్యలను పరిష్కరించుకోవాలని ఇరు రాష్ట్రాల సీఎస్‌లు అభిప్రాయపడ్డారని తెలిపారు. ఈ ఏడాది జూలై 6న ఇరు రాష్ట్రాల సీఎంలు సమావేశమై జరిపిన చర్చలకు అనుగుణంగా సమస్యలను పరిష్కరించుకోవాలని మరోసారి నిర్ణయించినట్టు వివరించారు. ఈ మేరకు వచ్చే సమావేశం నాటికి ఈరోజు చర్చించిన అంశాలపై నిర్దిష్ట ప్రతిపాదనలతో రావాలని తీర్మానించినట్టు తెలిపారు. ఇందుకోసం ఆయా శాఖల అధికారులు ముందుగా సమావేశమై చర్చించుకోవాలని, పరిష్కారానికి అవసరమైన వివరాలు సేకరించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. త్వరలో కమిటీ మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్టు తెలిపారు.

మంత్రుల కమిటీకే 'విద్యుత్'అంశం

ఇక రెండు రాష్ట్రాల మధ్య విద్యుత్ కొనుగోళ్లు, విక్రయాల అంశంలో నెలకొన్న వివాదాన్ని మంత్రుల కమిటీకి వదిలేయాలని సీఎస్‌ల కమిటీ నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే రూ.861 కోట్ల లేబర్ సెస్ నిధులను పంపిణీ చేసుకోవాలని, ఉద్యోగుల పరస్పర బదిలీలపై విస్తృతంగా చర్చించాలని ఏకాభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. ఈ అంశాలపై సీఎంలకు నివేదించిన తర్వాత తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. ఈ సమావేశంలో తెలంగాణ సీఎస్ శాంతికుమారి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ రిజ్వీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ఏపీ సీఎస్ నీరబ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'మేడిగడ్డ' ఎప్పుడు దెబ్బతింది?

- కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లను డ్యామ్‌లుగా ఏ ప్రాతిపదికన పరిగణించారు
- 2019లో బరాజ్‌లు పూర్తయితే 2021లో వాటిని గుర్తించడం వెనక అంతర్యమేంటి?
- రాష్ట్ర డ్యామ్‌ల భద్రత సంస్థ మాజీ ఎస్ఈ మురళీకృష్ణకు పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నలు
- ఆయన అమెరికాలో ఉండటంతో వర్చువల్‌గా సాగిన క్రాస్ ఎగ్జామినేషన్

సాక్షి, హైదరాబాద్: 'వరదనీటి మళ్లింపు కోసం నిర్మించే బరాజ్‌లను నీటినిల్వ డ్యామ్‌లుగా ఏ ప్రాతిపదికన పరిగణించారు? 2019లో బరాజ్‌లు పూర్తయితే 2021లో వచ్చిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్ కింద 2023 జూలైలో కాళేశ్వరం బరాజ్‌లను డ్యామ్ లుగా గుర్తించడం వెనక అంతర్యం ఏమిటి?' అని రాష్ట్ర డ్యామ్‌ల భద్రత సంస్థ (ఎస్డీఎస్ఓ) మాజీ ఎస్ఈ మురళీకృష్ణను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సోమవారం అమెరికాలో ఉన్న మురళీకృష్ణను వర్చువల్‌గా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.

చట్టంలో ఉన్నందునే పరిగణించాం..

'డ్యామ్‌ల రక్షణ చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది? మీరు అఫిడవిట్లో పేర్కొన్నదంతా వాస్తవమేనా? మీ బాధ్యతలేంటి?' అని కమిషన్ మురళీకృష్ణను ప్రశ్నించింది. అందుకు ఆయన బదులిస్తూ 2021 డిసెంబర్ 30న నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్‌ను నోటిఫై చేశారని పేర్కొన్నారు. 15 మీటర్ల ఎత్తు కలిగి, నీటిని నిల్వ చేసే జలాశయాలతోపాటు 10 మీటర్లకు మించి ఎత్తున్న చెక్ డ్యామ్‌లను కూడా డ్యామ్‌లుగా పరిగణించాలని చట్టంలో ఉందని మురళీకృష్ణ తెలియజేశారు. దీనిపై కమిషన్ స్పందిస్తూ 'నీటిని మళ్లించడానికే బరాజ్‌లు కడతారు.. మరి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను డ్యామ్‌లుగా ఎలా పరిగణించారు? అని మళ్లీ ప్రశ్నించింది. చట్ట ప్రకారం స్పెసిఫైడ్ డ్యామ్‌లుగా బరాజ్‌లను నోటిఫై చేశారని మురళీకృష్ణ వివరించారు. డ్యామ్‌ల రక్షణ చట్టం అమలు కోసం క్షేత్రస్థాయిలో అధికారులతో చర్చించామని.. ఆయా డ్యామ్‌లను సమగ్రంగా పరిశీలించి నోటిఫై చేయించామని తెలిపారు. బరాజ్‌లు ఎప్పుడు పూర్తయ్యాయని కమిషన్ ప్రశ్నించగా 2023లో స్పెసిఫైడ్ డ్యామ్‌లుగా నోటిఫై చేశామన్నారు. 2021లో చట్టం వస్తే 2019లోనే బరాజ్ పూర్తవడం వాస్తవమా? కాదా? అని కమిషన్ అడగ్గా వాస్తవమేనని చెప్పారు. పదేపదే విజ్ఞప్తుల అనంతరం స్పెసిఫైడ్ డ్యామ్‌ల జాబితాలో బరాజ్‌లను చేర్చారని బదులిచ్చారు. 2019లో మేడిగడ్డలో వరదలు వచ్చాయని, తొలుత సుందిళ్ల, అన్నారంలో బుంగలు ఏర్పడ్డాయని, ఆ తర్వాత మేడిగడ్డ దెబ్బతిందని మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అయితే బరాజ్‌ల అధికారులు ఈ విషయాన్ని నివేదించలేదని మురళీకృష్ణ వెల్లడించారు.

రెండో వారంలో మళ్లీ విచారణ

నాలుగో విడత క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి చేసిన జస్టిస్ చంద్రఘోష్.. మంగళవారం సాయంత్రం కోల్‌కతా తిరిగి వెళ్లనున్నారు. అనంతరం రెండో వారంలో తిరిగి హైదరాబాద్ వచ్చి ఐదో దఫా విచారణలో ఈఎన్సీలు, మాజీ ఈఎన్సీలను ప్రశ్నించనున్నారు. ఆ తర్వాత ఐఏఎస్‌లను విచారించే అవకాశాలున్నాయి.

జిల్లా వార్తలు

రామయ్యకు రూ.4లక్షల విలువైన హారం



ముత్యాలహారం అందజేస్తున్న దాత

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్ర స్వామికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు సోమవారం రూ.4లక్షల విలువైన హారాన్ని సమర్పించారు. హైద్రాబాద్‌కు చెందిన భక్తుడు దీపక్ ముత్యాలహారాన్ని అందజేయగా స్వామి వారి పాదాల చెంతన ఉంచి పూజలు చేశారు. అతర్వాత ఆలయ ఏఈఓ శ్రవణ్‌కుమార్‌కు అందచేయగా అధికారులు దాతను సత్కరించారు.

ఉపరాష్ట్రపతిని కలిసిన ఎంపీ వద్దిరాజు



ఉపరాష్ట్రపతితో కలచాలనం చేస్తున్న రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: పార్లమెంట్ సమావేశాల నేపథ్యాన సోమవారం ఢిల్లీలో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌ను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపరాష్ట్రపతి చాంబర్‌లో ఆయనను కలిసిన రవిచంద్ర కాసేపు సమావేశమయ్యారు.

రేపు మాజీ సీఎం రోశయ్య వర్ధంతి సభ

కొణిజర్ల: హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈనెల 4వ తేదీన(బుధవారం) జరగనున్న మాజీ సీఎం కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతి సభకు జిల్లాలోని ఆర్యవైశ్యులు తరలిరావాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు కొణతం ఉమా శంకరరావు, గ్రంధి ప్రవీణ్, మిట్టపల్లి శ్రీనివాస్, అనుమోలు ప్రసాద్, పసుమర్తి శంకర్, జవాజి నాగేశ్వరరావు కోరారు. కొణిజర్లలో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. జిల్లా నుండి సభకు వెళ్లే ఆర్యవైశ్యులకు ఉచిత బస్సు సౌకర్యం, భోజన వసతి కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

రాణా.. మొక్కలతో కళకళ!



ఆవరణలో పూలమొక్కలతో గార్డెన్

ములకలపల్లి పోలీసుస్టేషన్ కొత్త అందాలు సంతరించుకుంది. స్టేషన్ ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించి అందంగా తీర్చిదిద్దారు. అలాగే, గార్డెన్‌లో పూలమొక్కల మధ్య గడ్డి తొలగించి పాదులు చేయడంతో పాటు క్రోటాన్ మొక్కలను అందంగా కత్తిరించారు. కుండీల్లో పూల మొక్కలు నాటారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ చుట్టూ కొత్తగా ఫెన్సింగ్ వేయించారు. ఈ పనులతో సుమారు ఐదేళ్ల క్రితం ప్రారంభమైన పోలీస్‌స్టేషన్ ఆవరణ, పరిసరాలు సరికొత్తగా కనిపిస్తున్నాయి. –ములకలపల్లి



స్టేషన్ చుట్టూ ఏర్పాటుచేసిన ఫెన్సింగ్

స్టేషన్ ఆవరణలో క్రోటాన్ మొక్క

సరిహద్దుల్లో ముమ్మరంగా కూంబింగ్

- పీఎల్‌జీఏ వారోత్సవాలు ప్రారంభం
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న ఆదివాసీలు



కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

చర్ల/దుమ్ముగూడెం: మావోయిస్టు పార్టీ సోమవారం నుంచి ఈనెల 8వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యాన ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. పీఎల్‌జీఏ ఆవిర్భవించి 24 ఏళ్లు అవుతున్న సందర్భంగా అమరులకు నివాళులర్పించడంతో పాటు పెద్ద ఎత్తున వారోత్సవాలు నిర్వహించాలని పార్టీలోని పలు కమిటీలు పిలుపునిచ్చాయి. ఇదే కాక ఆదివారం ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం పోలీసులు గాలింపు చేపడుతున్నారు. ఈ మేరకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద ఎత్తున పోలీసు బలగాలను ఛత్తీస్‌గఢ్‌కు తరలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారోత్సవాలను అడ్డుకునేలా మూడు రాష్ట్రాల సీఆర్‌పీఎఫ్, కోబ్రా, డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ తదితర విభాగాల పోలీసులు దండకారణ్యంలో ముమ్మరంగా కూంబింగ్ చేస్తున్నారు.

భయాందోళనలో ఆదివాసీలు

ఇటీవల తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పెద్ద ఎత్తున పోలీసు క్యాంపులు ఏర్పాటవుతుండగా వీటిని వ్యతిరేకిస్తూ ఆదివాసీలు పలు రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. మరోవైపు పోలీసు క్యాంపులపై మావోయిస్టులు దాడులకు దిగుతున్నారు. ఈ తరుణాన వారోత్సవాలు జరుగుతుండడంతో ఆదివాసీల్లో మరింత ఆందోళన నెలకొంది. అడవుల నుంచి మైదాన ప్రాంతాలకు, మైదానం నుంచి అటవీ ప్రాంతాలకు ఎవరెవరు వెళ్తున్నారని అటు మావోయిస్టులు, ఇటు పోలీసులు కూపీ లాగుతూ తమను ఇబ్బంది పెడుతున్నారని వాపోతున్నారు. మరికొందరు అటవీ ప్రాంత గ్రామాల ఆదివాసీలు పెద్ద ఎత్తున వస్తున్న పోలీసులను చూసి భయంతో ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారని తెలుస్తోంది. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లోని నిమ్మలగూడెం, కర్రిగుండం, పుట్టపాడు, తెట్టెమడుగు, డోకుపాడు, కంచాల, కొరగట్ట, మీనగట్ట, జబ్బగట్ట, గుండ్రాయి తదితర గ్రామాల్లో పురుషులంతా ఇతర ప్రాంతాలకు వెళ్లగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలే ఇళ్లలో ఉన్నారని సమాచారం. ములుగు జిల్లాలో ఎన్‌కౌంటర్ జరగడంతో మావోయిస్టులు కూడా ప్రతిదాడికి దిగుతారనే అనుమానంతో వారంతా బిక్కుబిక్కుమంటూ గుడుపుతున్నారని తెలిసింది.

విస్తృతంగా వాహనాల తనిఖీలు

పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యాన దుమ్ముగూడెం మండలంలోని మారుమూల గ్రామాలతో పాటు మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో పోలీసు బలగాలు కూంబింగ్ చేస్తుండగా.. మైదాన ప్రాంతంలో సీఐ అశోక్‌కుమార్ నేతృత్వాన ఎస్ఐలు వెంకటప్పయ్య, గణేష్ వాహన తనిఖీలను ముమ్మరం చేశారు అనుమానితులను ప్రశ్నిస్తూ పత్రాలు పరశీలిస్తున్నారు. ములుగు జిల్లా ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న కొందరు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే అవకాశమున్నందున పోలీసు బలగాలు అడవిని జల్లెడ పడుతున్నాయి.

వెదురు నర్సరీ, బ్యాంబో క్లస్టర్‌ను పరిశీలించిన శాస్త్రవేత్తలు



అశ్వారావుపేట రూరల్ : వెదురు నర్సరీలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అశ్వారావుపేటరూరల్/చంద్రుగొండ: భద్రాద్రి జిల్లాలో వెదురు సాగుకు అనుకూలతలు, సాగుతో లాభాలు, ఉత్పత్తులతో యువతకు ఉపాధి కల్పన, ప్రభుత్వ రాయితీలను తెలుసుకునేందుకు మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన శాస్త్రవేత్తల బృందం సోమవారం పర్యటించింది. ఈమేరకు అశ్వారావుపేట సమీపంలోని కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రంలో జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ ఆదేశాలతో పెంచుతున్న వెదురు మెక్కలను సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకాంత్ గుంగా, రాహుల్ కుమార్, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ సిద్ధి ఫెడ్నేకర్, అమృత బేల్సు పరిశీలించారు. ఈమేరకు వెదురు మొక్కల పెంపకం, లాభాలు, రాయితీలపై జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జంగా కిషోర్ వారికి వివరించారు. రైతులకు వెదురు మొక్కల్ని ఉచితంగా అందించి, మూడేళ్ల పాటు వరకు సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. పొలం గట్లపై సాగు చేస్తే మూడేళ్లకు రూ.15వేలు, పొలాల్లో పంట సాగు చేస్తే మూడేళ్లకు రూ.20వేల సబ్సిడీ కింద అందిస్తున్నామని వెల్లడించారు. అనంతరం శాస్త్రవేత్తల బృందం చంద్రుగొండ మండలం బెండాలపాడు శివారులో ఉన్న బ్యాంబోక్లస్టర్‌ను సైతం సందర్శించారు. ఇక్కడ వెదురుతో తయారు చేస్తున్న ఉత్పత్తులను పరిశీలించాక వెదురు నర్సరీలో మార్కెటింగ్‌కు అనువైన రకాలపై ఆరా తీశారు. ఎంపీడీఓ బయ్యారపు అశోక్, క్లస్టర్ చైర్మన్ వీసం నాగభూషణం, డైరెక్టర్లు మల్లం కృష్ణయ్య, కారం అన్వేష్, పద్దం భద్రయ్య, పంచాయితీ కార్యదర్శి రోహిత్‌తో పాటు బొర్రా సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో...

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు మహారాష్ట్రకు చెందిన డాక్టర్ శ్రీకాంత్ బృందం పరిశీలించింది. కలెక్టర్ సూచనలతో ఇక్కడకు వచ్చిన వారు డక్‌పాండ్, కేటీపీఎస్ కెనాల్, డ్యామ్ పరిసరాలు, డీర్‌పార్కును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆర్ఐ హచ్యా, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌బీఓ రాములునాయక్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



పతకాలు సాధించిన క్రీడాకారులు

పాల్వంచరూరల్: జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో వేముల శివ, కె.లక్ష్మణ్, ఎం.చరణ్ వివిధ విభాగాల్లో సత్తా చాటగా జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు. క్రీడాకారులను శంకరయ్యతోపాటు అసోసియేషన్ అధ్యక్షుడు సాదుల సారంగపాణితో పాటు క్రిస్టోఫర్‌బాబు, సుబ్రహ్మణ్యం, బొజ్జి మారెప్ప, బుద్ద ప్రసాద్, కొండి గణేష్ తదితరులు అభినందించారు.



చంద్రుగొండ : వెదురుతో రూపొందించిన ఉత్పత్తులను పరిశీలిస్తూ...